రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	శనివారం	ఆదివారం
కర్నూలు	6:34	4:58
నంద్యాల	6:31	4:59

హాలహర్వి మండలం హర్దగేరిలో నీటి కుంటను తవ్వుతున్న కూలీలు



25 వేల నీటి కుంటలు



భూగర్భ జలాలు పెరిగితేనే తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. భూమిలో తేమ శాతం సంరక్షించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటలు (ఫారంపాండ్స్) తవ్వకాలు శ్రీకారం చుట్టింది. అన్నదాతల్లో చైతన్యం కలిగించి ప్రతి పంచాయతీలో పదికి తగ్గకుండా రాష్ట్రంలో రెండు లక్షల నీటికుంటలు తవ్వాలనే లక్ష్యం పెట్టుకున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఫారంపాండ్స్ తవ్వకాల కోసం రైతులను ప్రోత్సహించింది. తద్వారా కూలీలకు ఉన్న ఊళ్లోనే వంద రోజులు పని దినాలు కల్పించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్లక్ష్యం చేశారు. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ పథకం నిధులతో నీటి కుంటల తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలో 25 వేల నీటి కుంటలు తవ్వడం లక్ష్యం.

- ఉపాధి పనులతో జిల్లాలో నీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక
- రాష్ట్రంలో 2 లక్షల నీటి కుంటలు లక్ష్యం
- ప్రతి పంచాయతీలో పది ఫారం పాండ్స్
- ఉద్యమంగా చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడు పూడిచెర్లలో ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కర్నూలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 808 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్‌జీఎస్) అమలులో భాగంగా 6.25 లక్షలకు పైగా జాబ్ కార్డులు జారీ చేశారు. అందులో పనులకు హాజరయ్యే యాక్టివ్ జాబ్ కార్డులు 5.75 లక్షల వరకు ఉన్నాయని డ్వామా రికార్డులు ద్వారా తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.68 కోట్ల పని దినాలు కల్పించాలని లక్ష్యం. పంట కాలువలు పూడికతీత, ఊట కుంటలు, సరిహద్దు కందకాలు, గోకులాలు, సోక్ పిట్స్, చెరువులు, కుంటలు నవీకరణ.. వంటి పనులు ద్వారా కర్నూలు జిల్లాలో కూలీల వేతనాలు (లేబర్ బడ్జెట్) రూ.231.55 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కోసం రూ.73.08 కోట్లు ఖర్చు చేశారు. నంద్యాల జిల్లాలో కూలీల వేతనాలు కోసం రూ.167.69 కోట్లు, సామగ్రి కోసం రూ.55.01 కోట్లు ఖర్చు చేశారు. రైతు పొలాల్లో నీటి కుంటలు (ఫారంపాండ్స్) తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు పెంచడంతో పాటు భూమిలో తేమ శాతం, పశువులకు తాగునీరు, పంటలకు పురుగు మందులు పిచికారి నీరు అందుబాటులో ఉంటుంది. దీంతో రైతులను చైతన్యపరిచి రాష్ట్ర వ్యాప్తంగా ఓ ఉద్యమంలా ఈ కార్యక్రమం చేపట్టనున్నారు.

మద్దికెర మండలం ఎం అగ్రహారంలో ఉపాధి కూలీలతో నీటాకుంట తవ్వకాలు



ఉమ్మడి జిల్లాలో 25 వేలు నీటి కుంటలు

రైతులల్లో చైతన్యం కలిగించి రాష్ట్రంలో 2 లక్షల నీటి కుంటలు తవ్వాలని డ్వామా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నెలకు 10 ఫారంపాండ్స్ చొప్పున మూడు నెలల్లో 30 తవ్వాలని లక్ష్యం. ఉమ్మడి జిల్లాలో 808 పంచాయతీలు, మజరా గ్రామాల్లో దాదాపు 25 వేల నీటి కుంటలు తవ్వకానికి లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. వీటి కోసం సుమారుగా రూ.93-95 కోట్లు ఖర్చు చేయనున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ జల ప్రయోజనాలు కలిగించేలా రైతు పొలాల్లో 8 మీటర్లు వెడల్పు, 8 మీటర్లు పొడవు, 2 మీటర్లు లోతుతో 128 చదరపు మీటర్లు ఫారంపాండ్స్ తవ్వకానికి రూ.38,400 ఉపాధి హామీ నిధులు ఖర్చు చేయనున్నారు. రైతు ఆసక్తి ఉంటే 25 మీటర్లు పొడవు, 25 మీటర్లు వెడల్పు, 2 మీటర్లు లోతుతో 1,250 చదరపు మీటర్లతో ఫారంపాండ్ తవ్వుకుంటే రూ.3.75 లక్షలు ప్రభుత్వ వెచ్చిస్తుంది. బోరుబావులు తగ్గరలో నీటికుంటలు తవ్వుకుంటే బోర్లలో నీటిఊట పెరిగి సాగునీటి తీరుతాయని డ్వామా అధికారులు పేర్కొంటున్నారు.

పూడిచెర్లలో ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్

రాష్ట్ర వ్యాప్తంగా నీటి కుంటలు తవ్వకాన్ని సీఎం చంద్రబాబు ప్రభుత్వం నీటికుంటలు తవ్వకాన్ని ఉద్యమంలా చేపట్టింది. గ్రామీణాభివృద్ధి శాఖను చూస్తున్న డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ శనివారం (నేడు) ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో రైతు సూర రాజన్న పొలంలో గడ్డపార చేపట్టి నీటి కుంట తవ్వకం పనులకు శ్రీకారం చుడతారు. కలెక్టరు పి. రంజిత్‌బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేతృత్వంలో పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు.

మిగతా 6వ పేజీలో

నేడు ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా

- హాజరు కానున్న కలెక్టర్, ఎస్పీ, పాణ్యం ఎమ్మెల్యే



కర్నూలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకుల కోసం కార్ అండ్ బైక్ రేస్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా (కర్నూలు యూనిట్) స్థాయిలో విజేతల ఎంపిక కోసం లక్కీ డ్రా శనివారం ఆంధ్రజ్యోతి కర్నూలు యూనిట్ కార్యాలయంలో ఉంటుంది. కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ముఖ్యఅతిథులుగా హాజరై లక్కీడ్రా ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతో పాటు వందమంది ప్రోత్సాహక బహుమతులు విజేతలకు ఎంపిక చేస్తారు. 2024 నవంబరు నుంచి 2025 ఫిబ్రవరి వరకు ప్రతి నెలా మూడు చొప్పున నాలుగు నెలలకు 12 కూపన్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించారు. ఒక్కో నెల కూపన్లు ఒక సెట్టుగా.. నాలుగు నెలలకు నాలుగు సెట్లు కూపన్లు పాఠకులు గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఇండస్ స్కూల్ దగ్గర ఉన్న ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయానికి దాదాపు 10వేలకు పైగా పాఠకులు కూపన్లు పంపించారు. ఉమ్మడి జిల్లాలో మొదటి బహుమతి బైక్, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి కలర్ టీవీ, వంద మందికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తారు. అలాగే త్వరలో నిర్వహించే ఏపీ రాష్ట్ర స్థాయి లక్కీడ్రాలో బంపర్ బహుమతిగా కారు గెలుచుకునే అవకాశం ఉందని బ్రాంచ్ మేనేజర్ ఎ.లక్ష్మణ్, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్షకు 366 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 366 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 130 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 24,777 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 24,411 మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు 22 పరీక్షా కేంద్రాలను పరిశీలించామని తెలిపారు. రాష్ట్ర అబ్జర్వర్ అబ్రహం నంద్యాల పట్టణంలోని పలు కేంద్రాలను తనిఖీ చేశారని పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో ఆరు సిట్టింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి

- మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రౌడీయిజం తగ్గించే దిశగా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాలపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. తప్పిపోయిన బాలురు, బాలికల కేసులలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆచూకీ తెలుసుకోవాలని సూచించారు. స్కూళ్లు, కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. హత్యలు, అనుమానాస్పద మృతి కేసుల్లో త్వరితగతిన పురోగతి సాధించాలని సూచించారు. గ్రేవ్ కేసులు, యూఐ కేసులు, పీటీ కేసులు, మర్డర్, సైబర్ క్రైమ్ కేసులు, పోక్సో కేసులు, మిస్సింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు పురోగతిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని, నేరం చేసిన వారికి శిక్షపడేలా ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్, పోక్సో కేసుల్లో నిందితులపై నిఘా ఉంచి అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేయాలని పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, మద్యం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరుగకుండా నిరోధించాలని, బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌పై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ మంద జావళి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్‌బాబు, డీఎస్పీలు రామాంజినాయక్, ప్రమోద్, ట్రైనీ డీఎస్పీ రాజసింహారెడ్డి పాల్గొన్నారు.

వరిలో మరో 12 రకాల వంగడాలు

క్షేత్ర ప్రదర్శన నిర్వహించిన ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విడుదలకు సిద్ధంగా ఉన్న 12 రకాల వరి నూతన రకాల వంగడాలను శుక్రవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ జాన్సన్ ఆధ్వర్యంలో వరిలో విడుదలకు సిద్ధంగా ఉన్న 12 రకాల వరి వంగడాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతుల సమక్షంలో విడుదల చేశారు. వీటి గురించి వరి శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ డాక్టర్ జాన్సన్ మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్‌లో మొక్కజొన్న, సజ్జలు, కొర్రలు, సోయా చిక్కుడు వంటి పంటలను శనగ పంట వేసేముందు వేసుకోవడం వల్ల రైతులు అధిక ఆదాయంతో పాటు నేల ఉష్ణోగ్రతను తగ్గించి సేంద్రియ కర్బన శాతం, నేలలో తేమ శాతం, పోషకాల లభ్యత పెంపొందించవచ్చని అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్‌లో కోవెలకుంట్ల డివిజన్ పరిధిలో సుమారు 65 వేల హెక్టార్ల పంట పొలం ఖాళీగా ఉంచడం వల్ల దాదాపు సంవత్సరానికి రూ.32 కోట్ల నష్టం రైతాంగానికి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వరి నూతన రకాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ఉగాది ఏర్పాట్ల పరిశీలన



ఉగాది ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో ఈ నెల 27 నుంచి 31 వరకు ఉగాది మహోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి క్యూలైన్లు, పాతాళగంగ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సెక్యూరిటీ సిబ్బంది, శివసేవకులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్యూలైన్లలో మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లను అందజేయాలని అధికారులను ఆదేశించారు. కైలాసద్వారం వద్ద కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన శివసేవకులు పాదయాత్రగా వస్తున్న భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న జొన్నరొట్టెలను ఈఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ ఇంజనీరు ఎం.నరసింహారెడ్డి, ఏఈవోలు జి.స్వాములు, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటల ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నీటికుంటల ఏర్పాటులో నిర్ధేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ సచివాలయం నుంచి ప్రపంచ జలదినోత్సవం, పల్లె పండుగ పనుల ప్రగతిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1/3వ వంతు అటవీభూములు ఉన్నాయని, 14 మండలాల్లో 48 చెంచుగూడెల్లో గిరిజనులు నివసిస్తున్నారన్నారు. ఆర్వో, ఎఫ్ఆర్ కింద ఇచ్చిన పంట పొలాల్లో నీటి నిల్వ కోసం నీటికుంటల ఏర్పాటుకు అనుమతించాలని డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు యుద్ధ ప్రతిపాదిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా 2,590 ఫారం పాండ్ల నిర్మాణ లక్ష్యానికి 1,380 నీటికుంటల ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్నవాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాము నాయక్, డ్వామా పీడీ వెంకట సుబ్బయ్య, పంచాయితీరాజ్ ఎస్ఈ నాగరాజు పాల్గొన్నారు.

మెడికల్ షాపులపై విజిలెన్స్ మెరుపు దాడులు

ఉల్లంఘనలకు పాల్పడిన పదిమంది యజమానులపై కేసులు నమోదు



నంద్యాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలోని పలు మెడికల్ షాపులపై శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్, పోలీసు అధికారులు ఏకకాలంలో మెరుపుదాడులు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ షాపులపై నిర్వహించిన ఆపరేషన్ గరుడలో భాగంగా మెడికల్ షాపులు, ఏజన్సీలపై దాడులు జరిగాయి. జిల్లా విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు 22 మంది అధికారుల బృందం ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఏక కాలంలో దాడులకు పాల్పడడంతో మెడికల్ ఏజన్సీలు, షాపుల యజమానులు బెంబేలెత్తిపోయారు. నార్కోటిక్ డ్రగ్స్‌కు సంబంధించిన ఈ దాడుల్లో విస్తుపోయే అంశాలు వెలుగుచూశాయి. యజమానులు నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలకు తెరలేపారనేది అధికారుల దాడుల్లో బట్టబయలైంది. కాలం చెల్లిన మందుల అమ్మకాలు, డాక్టర్ల ప్రిస్కిప్షన్లు లేకుండానే మందుల అమ్మకాలు, లైసెన్స్‌కు మించి పరిధి దాటి డ్రగ్స్ నిల్వ చేయడం, ఏజన్సీ, మెడికల్ షాపుల్లో స్టాక్‌కు సంబంధించిన బిల్లులు లేకపోవడం, రికార్డులు సరిగా నిర్వహించకపోవడం వంటివి అధికారులు గుర్తించారు. కాస్మొటిక్స్ అండ్ డ్రగ్స్ యాక్ట్ సెక్షన్-65 ప్రకారం స్కంద, వెంకటేశ్వర, షణ్ముఖ, శ్రీలలితతో పాటు మరో ఆరు షాపులపై అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ యుగంధర్‌బాబు, ఇంజనీర్ ఆనంద్, సివిల్ సీఐలు ఆదినారాయణరెడ్డి, మారుతీ శంకర్, శాంద్‌బాషా, ముగ్గురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



నంద్యాలలోని మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు



జలమే జగతికి రక్ష

- నీటి సంరక్షణ మనందరి బాధ్యత
- నీటి వృథాను అరికడదాం.. భావితరాలకు భవితనిద్దాం
- నేడు ప్రపంచ జల దినోత్సవం

మానవాళి మనుగడలో నీరు కీలకం. నీరు లేని చోట జీవరాసుల మనుగడ దుర్లభం. జలాన్ని సంరక్షిస్తేనే.. మనం సురక్షితం.. అయినా మనం నీరు వృథా చేస్తుంటాం. భూమిపై నీటి ప్రాధాన్యతను గుర్తింపచేయడానికి ఏటా ప్రపంచ జల దినోత్సవాన్ని మార్చి 22వ తేదిన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తొలుత రియోడి జనీరో బ్రెజిల్‌లో పర్యావరణ అభివృద్ధిపై 1992లో ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించారు. ఐరాసలో మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు ప్రపంచ జల దినోత్సవాన్ని మార్చి 22వ తేదీన నిర్వహించేలా ఐరాస నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది హిమపాతాన్ని సంరక్షించాలని పిలుపునిచ్చింది.



ఆత్మకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వర్షపునీటిని భూగర్భంలోకి ఇంకించాలి. చుక్కనీరు కూడా వృథా కాకుండా ఒడిసిపట్టి అవసరం ఉన్నప్పుడు వినియోగించుకునేలా ప్రతి ఇంట్లో నీటి ట్యాంకులను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు తప్పనిసరి. సాగు కోసం సేద్యపు కందకాలు తవ్వించాలి. ఇందుకు ప్రభుత్వం సైతం రాయితీని అందిస్తోంది. ప్రత్యేకించి జలశక్తి అభియాన్ కింద చెరువుల్లో పూడికతీత, ఊట కుంటలు, చిన్నకుంటల నిర్మాణం, పంటకాల్వలు, గ్రామాల్లో సామాజిక ఇంకుడు గుంతలు, నీటి నిల్వ కుంటలు, చెక్‌డ్యాముల్లో పూడిక పనులు, రోడ్లకు ఇరువైపుల మొక్కల పెంపకం, పొలం, కాల్వ గట్ల వెంట మొక్కల పెంపకానికి ప్రోత్సహిస్తోంది. అంతేకాదు ఉపాధి హామీ పథకం ద్వారా కూడా ఈ పనులను చేపట్టే వెసులుబాటు ఉంది.



నీటి వృథాను అరికట్టేందుకు దోహదపడే చెక్‌డ్యామ్

శరీరంలో నీటి శాతం తక్కువైతే తలెత్తే ప్రమాదం

- డీహైడ్రేషన్ కలుగుతుంది. మలబద్ధకం పెరుగుతుంది. తలనొప్పి, తల తిరగడం, అలసట, ఆందోళన కలిగే అవకాశం వుంది.
- మూత్రవిసర్జన తగ్గుతుంది. కొన్ని పరిస్థితులు మాత్రం అగిపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల అనేక వ్యాధులు వస్తాయి. కండరాల నొప్పులు, బలహీనతలు ఏర్పడవచ్చు. చేతులు, కాళ్లు చల్లబడవచ్చు.
- వయస్సు పెరిగే కొద్ది దాహం తగ్గుతుంది. నీరు తాగాలని అనిపించకపోయినా.. తగినంత నీరు తాగడం మంచిది. లేనిపక్షంలో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి.
- రక్తపోటు, ఆస్థమా, విపరీతమైన శారీరక నొప్పులు వస్తాయి.
- నీటి వల్ల డయేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, అమిబియసిస్, కలరా వ్యాధులు సంభవించే ప్రమాదం వుంది.



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న జనం

నీళ్లు.. నిజాలు :

వేసవి వస్తోందంటేనే జనంలో భయం మొదలవుతుంది. బిందెలతో బారులు తీరే జనం కనిపిస్తారు. నేలతల్లి నెర్రలిచ్చి కరువు కష్టాలను ప్రతిబింబిస్తుంటే గుక్కెడు నీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా నీటి కోసం అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఆ వివరాలను పరిశీలిస్తే ఆశ్చర్యానికి గురికావాల్సి ఉంటుంది.

- ప్రపంచంలో 80దేశాలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నాయి.
- భూమండలం మీద లభించే నీటిలో ఉప్పు సముద్రాల వాటా 97శాతం, 2.92శాతం హిమపాతం, కేవలం 0.08 మాత్రమే స్వచ్ఛమైన నీరు వుంది.
- ప్రపంచవ్యాప్తంగా 3.575 మిలియన్ల జనం ప్రతి సంవత్సరం నీటి సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారు.
- నీటిమూలంగా సంభవించిన 43శాతం మరణాలు అతిసార వ్యాధే కారణం. ఈ మరణాలు కూడా 84శాతం 14ఏళ్ల లోపు చిన్నారులకే సంభవిస్తున్నాయి.
- 98శాతం మరణాలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే జరుగుతున్నాయి.
- భూమి మీదున్న నీటిలో ఒక్క శాతానికంటే తక్కువ మొత్తం నీళ్లను మాత్రమే మానవాళి వినియోగించుకుంటున్నారు.
- భూమిపై ప్రతి 15 సెకన్లకు ఒకరు నీటి సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నట్లు అంతర్జాతీయ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

నీటిని సంరక్షించుకోవడం మనందరి బాధ్యత



నీటిని సంరక్షించుకోవడం మనందరి బాధ్యత. వర్షపునీటిని ఒడిసిపట్టే విధంగా వీలైనంత వరకు ఇంగుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి. అలాగే కుళాయిల నుంచి నీరు వృథా జరగకుండా చూసుకోవాలి. ఎక్కడైనా పబ్లిక్ కుళాయిల నుంచి నీరు వృథా అవుతోంటే మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఇంట్లో వినియోగించుకున్న నీరు ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా చూసుకోవాలి.

- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

మనం తాగే నీరు మంచివేనా..?

వాస్తవానికి ఇటీవల కాలంలో జనం తాగేనీరు మంచివేనా..? అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. గ్రామాల్లో ఆర్‌డబ్ల్యుఎస్, పట్టణాలు, నగరాల్లో మున్సిపాలిటీల ద్వారా అందుతున్న జలం శుద్ధమేనా..? అన్న సందేహం తలెత్తుతోంది. ప్రత్యేకించి పట్టణాలు, నగరాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, ఇతర నీటి వనరుల నుంచి సరఫరా చేస్తున్నాయి. అయితే వచ్చే నీరు సక్రమంగా శుద్ధి జరగడం లేదని తెలుస్తోంది. అందుకే చాలా చోట్ల ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లు, మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద నుంచి నీరు కొంటున్నారు. కానీ ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్లు కూడా నిర్దిష్టమైన ప్రమాణాలు పాటించడం లేదని తెలుస్తోంది. నీటిని క్రమపద్ధతిలో శుద్ధి చేయకుండా విక్రయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఆత్మకూరులోని ఓ వాటర్ ప్లాంట్‌లో బ్యాక్టీరియా చేరినట్లు నిర్ధారణ అయింది. ఇది తెలియని కాలనీవాసులు అదే నీరు తాగాల్సి వచ్చింది. విషయాన్ని గుర్తించిన మున్సిపల్ అధికారులు వెంటనే ప్లాంట్‌ను సీజ్ చేశారు.



నీటి కుంటలు

కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం అభినందన

కర్నూలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో కర్నూలు జిల్లాలో 119.70 కిలోమీటర్లకు గాను 116.72 కిలోమీటర్లు పూర్తి చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండటంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలెక్టర్ రంజిత్ బాషాను అభినందించారు. శుక్రవారం విజయవాడ కార్యాలయం నుంచి ఫారంపాండ్స్ ఏర్పాట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పురోగతి, గోకులాల నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై కలెక్టర్లతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గోకులాల నిర్మాణాలకు సంబంధించి కర్నూలు జిల్లాలో 1200 లక్ష్యానికి గానూ 664 పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు. రోడ్లు లేని గ్రామాలు జిల్లాలో 21 ఉన్నాయని, అందులో 17 కోట్లతో 11 గ్రామాల్లో రోడ్ల పనులు మొదలు పెట్టామని తెలిపారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముక కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ధాన్యం కొనుగోళ్లకు ఎట్టకేలకు కర్నూలు మార్కెట్ యార్డులో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కర్నూలు మార్కెటింగ్ శాఖ జేడీ, కర్నూలు మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జి రామాంజనేయులు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ధాన్యం (వడ్లు)ను మిల్లర్లకు విక్రయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రతి రోజూ యార్డులో ధాన్యం కొనుగోలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఇప్పటి దాకా మిల్లర్ల వద్ద తమ ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, ఇక ఆ పరిస్థితులు ఉండవని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరకుతుందని, ఈ అవకాశాన్ని ధాన్యం పండిస్తున్న రైతులంతా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు నాగేష్, కేశవరెడ్డి, శివన్న, మిల్లర్లు, కార్మికుల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు శేషగిరి శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

అత్తరు గుబాళింపుల రంజాన్





- జోరుగా సాగుతున్న అత్తర్ల వ్యాపారం
- కొనుగోలుదారులతో కళకళలాడుతున్న దుకాణాలు

కర్నూలు కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) రంజాన్ మాసం వచ్చిందంటే కర్నూలు పాత నగరం అత్తరు గుబాళింపులు వెదజల్లుతుంటుంది. ఈ మాసంలో విరివిగా విభిన్న రకాల అత్తర్లు అందుబాటులోకి వస్తాయి. వాటి కొనుగోళ్లు జోరుగా సాగుతుంటాయి. ముస్లింలతోపాటు ముస్లిమేతరులు కూడా సువాసనా భరితమైన అత్తర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. పార్టీలు, ఫంక్షన్లలో ఆకర్షణీయమైన దుస్తులపై పరిమళాలు వెదజల్లే అత్తర్లను రాసుకోవడం అన్ని వర్గాల వారూ ఆసక్తి కనబరుస్తారు. దీంతో ఈ మాసంలో ప్రత్యేకంగా లభించే అత్తర్ల కోసం కొనుగోలుదారులతో ఈ దుకాణాలన్నీ కళకళలాడుతున్నాయి. రంజాన్ మాసం సందర్భంగా వ్యాపారులు ఈ మాసంలో ప్రత్యేకంగా లభించే అత్తర్లను దుబాయి, మస్కట్, కువైట్ తదితర ఎడారి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అత్తర్లలోనూ నిత్యం వినియోగించుకునే వాటితోపాటు ప్రత్యేక ఫంక్షన్ల సమయంలో వినియోగించేవి వేర్వేరుగా ఉంటున్నాయి. ఇక మహిళలకు ప్రత్యేకమైన సువాసనలు వెదజల్లేవి కొన్నైతే, మగవారి కోసం మరికొన్ని అందుబాటులో ఉంటున్నాయి.



రంజాన్ మాసంలో ప్రత్యేక అమ్మకాలు...

అనేక రకాల బ్రాండ్ల అత్తర్లు ఈ మాసంలో విక్రయిస్తున్నాం. యువత, మహిళలు, మగవారికి వేటికవే ప్రత్యేకంగా లభిస్తున్నాయి. ఒక బ్రాండ్‌కు అలవాటు పడినవారు తిరిగి వేరే బ్రాండ్లపై ఆసక్తి చూపించరు. అందుకే వారికోసం ప్రత్యేకంగా తెప్పించి అమ్మకాలు చేస్తున్నాం. రూ.50 మొదలు రూ.8వేల వరకు అత్తర్లు ఖరీదు ఉంటున్నాయి.

- మహమ్మద్ యూసటఫ్, వ్యాపారి, పాతనగరం

మనసుకు హాయిగొలిపే అత్తరు పరిమళం...

మల్లెపూలు, గులాబీపూలు, గంధపు చెక్కలు, మొగలి పువ్వులు ఇలా అనేక పూల పరిమళాలతో మనసుకు హాయిగొలిపే అత్తర్లు మార్కెట్లో లభిస్తున్నాయి. అత్తరు ఎంత ఎక్కువ కాలం భద్రపరిస్తే అంత సువాసనను వెదజల్లుతుంది. కొన్ని అత్తర్లు దుస్తులకు రాసాక కూడా వాటిని ఉతికినా సువాసన అలాగే ఉంటుంది. అలాంటివే అసలు సిసలైన అత్తర్లుగా చెప్పవచ్చు. అత్తర్లలోనూ అనేక రకాలు ఉన్నాయి. ఇవి పడని వారికి శ్వాస ఇబ్బంది కలుగుతుంది. అందుకే తమకు నచ్చిన వాటినే ఎంపిక చేసుకోవాలని వ్యాపారులు సూచిస్తుంటారు. ఇక వేసవిలో ఖాస్, ఇత్రేగిల్ అత్తర్లు చల్లదనాన్ని ఇస్తాయి. చలి, వర్షాకాలంలో షమామతుల్, హీనా, జాఫ్రాన్, దహనల్ ఊద్ వంటివి వెచ్చదనాన్ని ఇస్తాయి. అలాగే రంజాన్ సీజన్‌లో జన్నతుల్ ఫిర్దోస్, మజ్మ, షాజాన్, మన్నా, నాయబ్, హోప్, బకూర్, మొకల్లత్, దహనుల్ ఊద్ వంటివి లభిస్తున్నాయి.



అన్ని కాలాలకు అనుగుణంగా యువత ఆసక్తి...

అన్ని కాలాలకు అనుగుణంగా ఉన్న అత్తర్లు, పర్‌ఫ్యూమ్స్‌పై యువత ఆసక్తి చూపిస్తున్నారు. రంజాన్ మాసంలో అటు అత్తర్లతోపాటూ ఇటు విభిన్న రకాల పర్‌ఫ్యూమ్స్ కూడా జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. ఒకప్పుడు వేసవి కాలంలో శరీరానికి చెమట దుర్గంధం రాకుండా చాలా మంది పర్‌ఫ్యూమ్‌లు వాడేవారు. కానీ ప్రస్తుత కాలంలో అన్ని సీజన్లలో వినియోగించే రకాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చేశాయి. యువత శరీరానికి వినియోగించే డియోడరిండ్లు, పర్‌ఫ్యూమ్స్‌లు, దుస్తులకు రాసుకునే అత్తర్లు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.

తహసీల్దార్ల పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న 267 తహసీల్దార్ల పోస్టులను భర్తీ చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు తీర్పునకు లోబడి రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న తహసీల్దార్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చిన ఏకైక సీఎం చంద్రబాబే అని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం జనవరిలో 1,033 కోట్లు చెల్లించిందన్నారు. రెండు మూడు రోజుల్లో మిగతా బకాయిలు 6,200 కోట్లు చెల్లిస్తున్న సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ, వార్డు సచివాలయం క్రమబద్ధీకరణలో భాగంగా ప్రతి సచివాలయానికి ఒక వీఆర్వో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం త్వరలో పీఆర్సీ కమిషన్ వేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మిరాజు, మిలా విభాగం చైర్మన్ సెహేరాబాను, వైస్ చైర్మన్ మద్దిలేటి, ఏపీ ఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, లోకేశ్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

---

25 వేల నీటి కుంటలు

(5వ పేజీ తరువాయి)

ఉదయం 9.45 గంటలకు కర్నూలు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి (ఓర్వకల్లు) విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి రోడ్డు మార్గంలో పూడిచెర్లకు చేరుకుంటారు. 10.10 గంటలకు ఫారంపాండ్ పనులను ప్రారంభిస్తారు. అనంతరం ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకొని 11.45 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళ్తారు.

పవన్ సార్.. వీటిపై దృష్టి సారించండి:

- ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు మూడు నెలలుగా వేతనాలు అందలేదు. కూలీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవతున్నారు. ఉపాధి పనులకు వెళితే సకాలంలో కూలీ డబ్బులు రావడంతో లేదని ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. కర్నూలు జిల్లాలో దాదాపు రూ.25-30 కోట్లు వరకు బకాయి ఉందని తెలుస్తుంది. నంద్యాల జిల్లాలో కూడా రూ.16-18 కోట్లు బకాయి ఉందని అధికారులే అంటున్నారు. తక్షణమే కూలీ డబ్బులు చెల్లించాలి.
- పల్లె పండుగ కార్యక్రంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.67.58 కోట్లతో 830 సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడితే 792 పూర్తి చేశారు. దాదాపు రూ.40 కోట్లకు పైగా బిల్లులు బకాయి ఉన్నాయి. నంద్యాల జిల్లాలో రూ.85.12 కోట్లలో 1,093 సీసీ రోడ్ల పనులు చేపట్టి 945 పనులు పూర్తి చేశారు. 145 పనులు పురోగతిలో ఉన్నాయి. ఇక్కడ కూడా బిల్లులు అందక పనులు చేసిన కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు.
- పశుపోషణ ఆధారంగా జీవనం సాగిస్తున్న రైతులకు ఉపాధి హామీ పథకం నిధులతో గోకులం షెడ్లు నిర్మిస్తారంటే.. ఉత్సాహంతో రైతులు ముందుకు వచ్చారు. కర్నూలు జిల్లాలో రూ.21.92 కోట్లతో 959 గోకులం షెడ్లు మంజూరు చేశారు. రూ.9.76 కోట్లు ఖర్చు చేసి 651 షెడ్లు నిర్మాణం పూర్తి చేశారు. నంద్యాల జిల్లాలో రూ.19.61 కోట్లతో 854 గోకులం షెడ్లు మంజూరు చేస్తే.. 529 షెడ్లు పనులు పూర్తయ్యాయి. 325 షెడ్లు పురోగతిలో ఉన్నాయి. వీటికి కూడా బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి నిర్మంచుకున్న రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి బకాయి నిధులు విడుదల చేసి కూలీలు, రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. నేడు పూడిచర్లలో జరిగే ఫారంపాండ్స్ పనుల ప్రారంభోత్సవం సభలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతున్నారు.



దేవనకొండ మండలం కొత్తపల్లిలో రైతు పొలంలో తవ్వుకొన్న ఫారంపాండ్

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ



తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డైరెక్టర్ మోహన్‌రావు తనిఖీ చేశారు. జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీలో 2024-25లో జరిగిన లావాదేవీలపై వార్షిక తనిఖీ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డీటీవో రామచంద్రరావు, అసిస్టెంట్ డీటీవో జయలక్ష్మి, ఎస్‌టీవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌కు సతీ వియోగం



షహనాజ్ (ఫైల్)

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్ (69) శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో అనారోగ్య ంతో కన్నుమూశారు. పవిత్ర శుక్రవారమే అంత్యక్రియలు చేయాలని పెద్దల నిర్ణయం మేరకు హైదరాబాద్‌లోనే అంత్య క్రియలు నిర్వహిం చారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఆళ్లగడ్డ, పాణ్యం, నందికొట్కూరు, శ్రీశైలం ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరుచరితా రెడ్డి, గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నంద్యాల, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, నంద్యాల నుంచి టీడీపీ నాయకులు, అభిమానులతో పాటు పలువురు హైదరాబాద్ వెళ్లి ఫరూక్‌ను పరామర్శించారు.

కర్నూలు అర్బన్: మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్ మృతి పట్ల మంత్రి టీజీ భరత్, ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కౌలుట్లయ్య (ఫైల్)

తుగ్గలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన కౌలుట్లయ్య (66) అప్పుల బాధతో శుక్రవారం పొలంలో ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. కౌలుట్లయ్య సొంత పొలం ఆరెకరాలతో పాటు మరో 12 ఎకరాలు కౌలుకు చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. మూడేళ్ల నుంచి కంది, ఉల్లి పంటలు సాగు చేసి దాదాపు రూ.10 లక్షలు అప్పు చేశారు. అప్పు తీర్చే మార్గం లేదని మనస్తాపం చెంది పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు, రైతులు హుటాహుటిన అంబులెన్సులో తుగ్గలి వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మృతి చెందారు. కౌలుట్లయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు లక్ష్మణ స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్ (ఫైల్)

వెలుగోడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వెలుగోడు మండలంలోని మోతు కూరు గ్రామానికి చెందిన అశోక్ (26) వెలుగోడు పట్టణంలో అపోలోఫార్మసీలో పని చేస్తున్నాడు. మోతుకూరు నుంచి ద్విచక్ర వాహనంపై వెలుగోడుకు బయలుదేరాడు. వెలుగోడు నుండి నంద్యాలకు బయలు దేరిన ట్రాలీ ఆటో బోయరేవుల మోతుకూరు గ్రామాల మధ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ షాషావలి కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

ప్యాపిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగమర్రి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా వ్యవహరించిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు బొజ్జన్నపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

ఆత్మకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం దారుణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు కల్లంలో మధ్యాహ్నం నిద్రిస్తుండగా ఓ వ్యక్తి ఫూటుగా మద్యం సేవించి ఆమెపై అత్యాచారం చేసే ప్రయత్నం చేశాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకో గానే అతడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినట్లయితే కేసు నమోదు చేస్తామని ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి తెలిపారు.

ఎల్లెల్సీలో మహిళ మృతదేహం

హొళగుంద, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎల్లెల్సీ దిగువ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరామ్ నాయక్ శుక్రవారం తెలిపారు. హొళగుంద గ్రామ శివారులోని బళ్లారి బ్రిడ్జ్ వద్ద ప్రవహిస్తున్న ఎల్లెల్సీలో మృత దేహం ఉన్న సమాచారం రావడంతో వెళ్లి మృతదేహాన్ని పరిశీలిం చినట్లు తెలిపారు. మృతురాలి ఒంటిపై ఎరుపు జాకెట్ ఉన్నట్లు తెలి పారు. కుడి చేతిపై ఎం రాజమ్మ అనే పేరున కన్నడ భాషలో పచ్చ బొట్టు ఉన్నట్లు తెలిపారు. ఆమె వయస్సు 30 నుండి 35 సంవత్స రాలు ఉంటుందని అన్నారు. గ్రామ సేవకుడు తలారి సిద్దలింగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కేసీ కెనాల్‌లో అస్థిపంజరం

నంద్యాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పొన్నాపురంలో ప్రవహిస్తున్న కేసీ కెనాల్‌లో శుక్రవారం ఓ అస్థి పంజరం కొట్టుకుని వచ్చింది. సిమెంట్ సంచులతో నిండుగా కట్టి పడేసి, కాల్వలో కొట్టుకొని వస్తుంటే గుర్తు తెలియని మృతదేహంగా స్థానికులు గుర్తించారు. నంద్యాల తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని కేసీ కాల్వలోని ఆ సంచిని వెలికి తీశారు. తీరా చూస్తే అందులో మగ అస్థిపంజరం ఉండడంతో అవాక్కయ్యారు. ఎక్కడో హత్యచేసి మృతదేహాన్ని కట్టిపడేసి కాల్వలో పడేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. తాలూకా అర్బన్ సీఐ ఈశ్వరయ్య సమక్షంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్‌ను ఘటన స్థలానికి పిలి పించి అస్థిపంజరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్మికులు ఖననం చేశారు. పోస్టుమార్టం నివేదిక అనం తరం మరిన్ని విషయాలు విచారణలో వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

కంప్రెషర్ పేలి నలుగురికి గాయాలు

సి.బెళగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో నడిపి అక్బర్ అనే రైతు పొలంలో గుండ్లు తీయడానికి వాడిన కంప్రెషర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కంప్రెషర్ యజమాని రాజు శుక్రవారం అక్బర్‌కు చెందిన పొలంలో గుండ్లు తీస్తున్నాడు. వరుసగా మూడు ఫూతాలను వేసి పేల్చగా రెండు పేలాయి. మూడోది పేలక పోవడంతో శ్రీరాములు, వీరాంజినేయులు, డోలుమద్ది దగ్గరకు వెళ్లి పరిశీలిస్తుండగా ఈ క్రమంలో అది పేలి ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా గాయాలైన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కంప్రెషర్ బండి యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, తమ వాళ్లకు అనుభవం లేదని చెప్పినా వినకుండా తీసుకెళ్లాడని ఆరోపించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

కర్నూలు న్యూసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24, 25 తేదీలలో జరగాల్సిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెను వాయిదా వేసినట్లు యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఇ.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె నివారణ గురించి న్యూ ఢిల్లీలో సెంట్రల్ లేబర్ కమిషనర్ బ్యాంకు, కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు, బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక మధ్య జరిగిన సయోధ్యలో సానుకూలంగా డిమాండ్ల పరిష్కారానికి స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. సమ్మెను వచ్చే నెలకు వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బోర్డు తిప్పేసిన జనని

- లక్షాధికారులను చేస్తామని నట్టేట ముంచాడు
- నగలు, డబ్బుతో ఉడాయించిన మహిళా బ్యాంకు సీఈవో వెంకటరమణ
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు



జనని పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం



బాధితురాలు హరిప్రియ

కోవెలకుంట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనని పరస్పర సహకార పరపతి సంఘం పేరుతో ఏర్పాటు చేసిన జనని మహిళా బ్యాంకు బోర్డు తిప్పేసింది. ఆ సంస్థ సీఈఓ వెంకటరమణ గత 20 రోజులుగా సెల్‌ఫోను స్విచ్చాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లడంతో డిపాజిటర్లు గగ్గోలు పెడుతు న్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ మహిళలు ఒక్కొక్కరు రూ.లక్షల్లో సొమ్మును ఆ పరపతి సంఘంలో డిపాజిట్ చేయడంతో ఆ డబ్బు తిరిగి వస్తుందో రాదోనని వారిలో తీవ్ర ఆందోళన నెల కొంది. కొందరు మహిళలు సీఈవో స్వస్థలం కడపకు వెళ్లి అతని ఇంటి వద్ద ఆరా తీయగా సీఈవో ఆచూకీ లేకపోవడంతో వారికి నిరాశ మిగిలింది. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన హరిప్రియ అనే మహిళను బ్యాంకు ట్రెజరర్‌గా నియమిస్తున్నామని చెప్పి నమ్మ బలికి ఆమె నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారు, ఐదు లక్షల నగదు తీసుకున్నారు. బంగారు లాకరులో ఉంచుతామని చెప్పి అధిక వడ్డీ పేరుతో మోసం చేశాడని హరిప్రియ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగి సముద్రాల బాలసుబ్బయ్య ఈ సంస్థలో ఆరు లక్షలు డిపాజిట్ చేశాడు. బాండ్లు మెచ్యూర్ కావడంతో అతనికి వడ్డీతో కలిపి సుమారు రూ.7.40 లక్షలు రావాల్సి ఉంది. జననీ బ్యాంకు సిబ్బంది బాలసుబ్బయ్యకు చెక్ ఇచ్చారు. నగదు డ్రా చేసుకునేందుకు అతనికి సేవింగ్ ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లగా జననీ మహిళా బ్యాంకు ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. మహిళా బ్యాంకు సీఈవో వెంకటరమణకు ఫోను చేయగా ఆఫోను స్విచ్చాఫ్ చేసి ఉండడం, 20 రోజుల నుంచి అందుబాటులో లేకపోవడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతు న్నారు. దీంతో డిపాజిటర్లు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జున రెడ్డి బ్యాంకు సిబ్బందిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారించగా వెంకటరమణ ఫోను స్విచ్చాఫ్ చేసి ఎస్కేప్ అయ్యాడని తెలిపారు. గత 20 రోజులుగా అందు బాటులో లేడని పోలీసులకు వివరించారు. తమను చూసి పట్టణానికి చెందిన ఎందరో మహి ళలు రూ.లక్షల్లో డిపాజిట్ చేశారని పరపతి సంఘం సెక్రటరీ పద్మావతి తెలిపారు.

ఎవరీ వెంకటరమణ



కడప పట్టణానికి చెందిన వెంకటరమణ స్థానికంగా ఉన్న పరిచయాలు ఆసరాగా చేసుకుని నం ద్యాల జిల్లాలో ఐదు బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాడు. కోవెలకుంట్లతో పాటు చాగలమర్రి, బనగానపల్లె, నంద్యాల తదితర చోట్ల జననీ మ్యాక్స్ సంస్థ పేరుతో జననీ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం కార్యాలయాలు తెరిచాడు. ఆ సంస్థ ద్వారా డిపాజిట్లపై రూపాయి వడ్డీ ఆ డిపాజిట్‌కు నగదుపై రుణం తీసుకుంటే ఒకటిన్నర రూపాయి చొప్పున వడ్డీ తీసుకుంటూ నాలుగు సంవత్సరా లుగా ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. వేలాది మంది మహిళల నుంచి సుమారు రూ.2కోట్ల మేర భారీ మొత్తంతో డిపాజిట్లు సేకరించినట్లు తెలిసింది. ఈ సంస్థలో డబ్బు పొదుపు చేసిన డిపాజిటర్లు ఆ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడంతో వారికి చెల్లించేందుకు నగదు అందుబాటులో లేకపోవ డంతో ఆ సంస్థలో పని చేస్తున్న సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. డిపాజిటర్ల నుంచి ఒత్తిడి అధికం కావడం, డిపాజిటర్లు పోలీసులను ఆశ్రయించడంతో సీఈవో వెంకటరమణ డిపాజిటర్ల నగదు, బంగారం స్వాహా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.

ఆ ఐదుగురే..!

- సంజన్న హత్య కేసులో నిందితుల అరెస్టు
- ఆధిపత్య పోరు.. పాత కక్షలే కారణం



నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శరీన్‌నగర్‌లో సంచలనం సృష్టించిన కాశపోగు సంజన్న హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, సీఐలు మధుసూదన్‌గౌడు, శేషయ్యలు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితులు వడ్డె ఆంజనేయులు, ఆయన కుమారులు వడ్డె శివ, వడ్డె తులసి, వడ్డె రేవంత్, వీరి అనుచరుడు వడ్డె అశోక్‌లను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన నాలుగు వేటకొడవళ్లు, ఒక పిడి బాకు, ఆరు సెల్ ఫోన్లు, రెండు కట్టెలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ తెలిపిన మేరకు.. మృతుడు సంజన్న, కుటుంబ సభ్యులు, నిందితుడు ఆంజనే యులు కుటుంబ సభ్యుల మధ్య కొద్ది కాలంగా గొడవలు ఉన్నాయి. ఆధిపత్య కోసం ఒకరిపై ఒకరు పోటీ పడ్డారు. 2022లో కూడా వీరిద్దరు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకు న్నారు. ఈ నెల 14న ఉదయం ఇమ్రాన్ అనే వ్యక్తి వడ్డె ఆంజనేయులుతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆంజనే యులు చొక్కా కాలర్ పట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు అందరూ తనను చులకనగా చూశారని, తాను అంటే భయం పోయిందని, సంజన్నను చూసే ఇదంతా చేస్తున్నారని కొడుకులతో వాపోయాడు. ఎలాగైనా సంజన్నను హతమార్చాలని ప్రణాళిక చేసుకు న్నారు. అదే రోజు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో కాశపోగు సంజన్న శరీన్‌నగర్‌లో ఉన్న మెడిటేషన్ సెంటర్‌కు రావడంతో అప్పటికే కాపు కాసిన వీరంతా సంజన్నపై దాడి చేసి హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చాకచక్యంగా నిందితులను పట్టుకున్నారు. ఆంజనేయులు భార్య, అల్లుడి పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు. రౌడీషీటర్లపై నిఘా పెంచామని, ప్రతి ఆదివారం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లను కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన డీఎస్పీలు, సీఐలు శేషయ్య, మధుసూదన్‌గౌడు, చంద్రబాబు నాయుడు, శ్రీధర్, తబ్రేజ్, వేణుగోపాల్‌లను ఎస్పీ అభినందించారు.

పోలీసు అధికారులకు పురస్కారాలు

కర్నూలు క్రైం/నంద్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):



హుసేన్ పీరా



యుగంధర్ బాబు

కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం 2025 ఉగాది పురస్కారాలు ప్రకటించింది. ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా పలు విభాగాల్లో ఈ అవార్డులు ప్రకటిస్తుంది. ఇందులో భాగంగా నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన సుమారు 38 మంది పోలీసులకు ఈ అవార్డులు వరించాయి. కర్నూలు అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుసేన్ పీరా, ఏపీ ఎస్పీ రెండో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావుకు ఉత్తమ సేవా పతకాలు, నంద్యాల అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబుకు సేవా పతకాలు వరించాయి.

ఉత్తమ సేవా పతకం: ముచ్చుమర్రి ఏఎస్ఐ కృష్ణుడు, ఏపీఎస్పీ రెండో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ లూథర్, కర్నూలు హోంగార్డు యూనిట్ ఏఆర్ఎస్ఐ లక్ష్మీకాంతరెడ్డి

కఠిన సేవా పతకం: రెండో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రామిరెడ్డి, పీసీ రెండో బెటాలియన్ కానిస్టేబుల్ నబీరసూల్,

సేవా పతకం: విజిలెన్స్ సీఐ యుగంధర్ బాబు, సీఐడీ సీఐ నగేష్‌బాబు, కర్నూలు ఏఆర్ విభాగం ఆర్ఐ నారాయణ, ఏఆర్ఎస్ఐ నరసన్న, గూడూరు ఏఎస్ఐ శ్రీనివాసులు, కర్నూలు ఏఆర్ఎస్ఐ గోపాల్, కె. నాగలాపురం హెచ్‌సీలు మహమ్మద్ హనీఫ్, హరిశ్చంద్రుడు, కర్నూలు త్రీటౌన్ పీసీ శిఖామణి, కర్నూలు ట్రాఫిక్ పీసీ ఖలిందర్‌షా, నంద్యాల ఏఆర్ హెచ్‌సీలు జగన్మోహన్ రెడ్డి, ఎల్లప్ప, బేతంచెర్ల హెచ్‌సీ షేక్షావలి, నంద్యాల ట్రాఫిక్ హెచ్‌సీ శ్రీనివాసులు, బండి ఆత్మకూరు ఏఎస్ఐ మహ్మద్ రఫీక్, సంజామల ఏఎస్ఐ నాగరాజు, రెండో బెటాలియన్ ఏఆర్ ఎస్ఐలు శ్రీనివాసరెడ్డి, చక్రపాణి, ప్రహ్లాదరావు, రెండో బెటాలియన్ హెచ్‌సీ సుందరయ్య, కోడుమూరు, డోన్, ఆత్మకూరు ఫైరింగ్ స్టేషన్ల లీడింగ్ ఫైర్‌మన్లు సత్యం, ప్రభాకర్, చైతన్య కుమార్ రెడ్డి, నంద్యాల ఫైర్ స్టేషన్ డ్రైవర్ శ్రీనివాసులు, కర్నూలు విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్, ఇబ్రహీం, కర్నూలు ఎయిర్‌పోర్టు ఎస్ఐ ఆశ్వంత్ కుమార్.

మెడికల్ దుకాణాల తనిఖీ



కర్నూలులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కర్నూలు క్రైం/ హాస్పిటల్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ గరుడలో భాగంగా ఈగల్ చీఫ్ ఐజీ రవికృష్ణ ఆదేశాల మేరకు విజిలెన్స్, డ్రగ్స్ కంట్రోల్, స్థానిక పోలీసుల ఆధ్వ ర్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని మెడికల్ దుకాణాల్లో, ఏజెన్సీలపై తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి, సీఐలు యుగం ధర్‌బాబు, చంద్రశేఖర్ రెడ్డి, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్లు తేజా, ఏడీ రమాదేవి, తహసీల్దార్ వెంకటనారాయణ తదిత రులు సుమారు 25 పైగా మెడికల్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. పలు మెడికల్ షాపుల్లో నిద్రమత్తు కలిగించే సెడేటివ్ డ్రగ్స్‌ను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇస్తున్నట్లు తేలింది. కొంతమంది విజిలెన్స్ సిబ్బంది మఫ్టీలో మందుల దుకాణాల వద్దకు వెళ్లి ఈ సెడెటివ్ డ్రగ్స్ ఇవ్వాలని అడుగగా వారు వెంటనే ఇచ్చారు. అలాగే డ్రగ్స్‌పై ఎక్స్‌పైరీ డేట్ ముగిసినా కూడా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే బిల్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు తెల్చారు. కర్నూలులో 15 చోట్ల, ఆదోనిలో 8 దుకాణాల్లో, నంద్యాలలో 10 షాపుల్లో ఈ తనిఖీలు చేశారు.

ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారుల నియామకం

- 27న నామినేషన్, ఎన్నికలు
- జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలు కలెక్టర్ పర్యవేక్షణలో జరగనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి తెలిపారు. శుక్రవారం మాట్లాడు తూ జిల్లా పరిషత్ కో ఆప్షన్ ఎన్నిక కలెక్టర్ పి.రంజి త్‌బాషా పర్యవేక్షణలో జడ్పీ సమావేశం భవనంలో జరుగుతుందన్నారు. తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీ ఎన్నికలు, క్రిష్ణగిరి కో ఆప్షన్ ఎన్నికలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. తుగ్గలి ఎంపీపీ ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారిగా హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్, వెల్దుర్తి ఎంపీపీ ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసిదేవి, క్రిష్ణగిరి కో ఆప్షన్ ఎన్నికకు సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ వ్యవహరిస్తారన్నారు. 27న ఉదయం 10 గంటలలోపల నామినేషన్ ప్రక్రియ, 10 నుంచి 12 గంటల వరకు పరిశీలన, 12 గంటలకు జాబితా ప్రచురణ, ఒంటి గంటకు ప్రత్యేక సమావేశం అనంతరం ఎన్నికలు జరుగుతాయన్నారు. జడ్పీ కో ఆప్షన్ ఎన్నికకు సంబంధించి ఎంపీ, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల పరీక్ష వాయిదా పడింది. ఏప్రిల్ 6వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా వేసినట్లు, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఐ. శ్రీదేవి శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి హాల్ టికెట్ జారీ చేశామన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13వ తేదీన 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడి యట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆన్‌లైన్‌లో వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు.

గ్రేడింగ్ చేయిస్తున్నారని ఫిర్యాదు



సాయంత్రం గ్రేడింగ్ చేసేందుకు వచ్చిన కూలీలు

ఆదోని అగ్రికల్చర్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు వేరుశనగ దిగుబడిని కూలీలు చేత సాయంత్రం 6.30 గంటల వరకు గ్రేడింగ్ చేయిం చడంపై శుక్రవారం సమ్మతి గేరి గ్రామానికి చెందిన పంపన్న అనే రైతు మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. పొలంలోనే వేరుశనగను ఆరబెట్టుకొని చెత్తాచెదారం, రాళ్లను తొలగించి గ్రేడింగ్ చేసుకొని మార్కెట్ యార్డ్‌కు విక్రయానికి తీసుకొని వచ్చానన్నారు. 91 బస్తాలు మార్కెట్ యార్డ్‌కు తీసుకురాగా మధ్యాహ్నం ఒంటి గంటకే తూకాలు వేసుకోవాల్సింది పోయి సాయత్రం 6.30 గంటలకు మరో 20 మంది కూలీలతో వచ్చి నిబం ధనలకు విరు ద్ధంగా గ్రేడింగ్ చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సదరు టెండర్ దారుడిని గ్రేడింగ్ చేయ్యొద్దని సూచించినా పట్టించుకోకుండా దబాయించా రన్నారు. దీనిపై సూపర్‌వైజర్ మోహన్ రెడ్డిని వివరణ కోరగా.. రైతు పంపన్న కమిషన్ ఏజెంట్ రాతపూర్వకంగా తమకు ఫిర్యాదు చేశారని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పల్లెలను అభివృద్ధి చేస్తాం

- నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహరా



వ్యాపారులతో మాట్లాడుతున్న నాబార్డు డీజీఎం ఎంఎం బెహరా

మద్దికెర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మారుమూల పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని నాబార్డు రాష్ట్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.ఎం బెహరా అన్నారు. శుక్రవారం గ్రామంలో నాబార్డు నిధులతో నిర్మించిన కూర గాయల మార్కెట్‌ను పరిశీలించారు. చిరు వ్యాపారులు రోడ్డుకు ఇరువైపుల వ్యాపారం చేసుకునే వారని మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి రూ.3లక్షలు ఇవ్వడంతో నాబార్డు నుంచి రూ.15 లక్షలుతో మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో గోసినాపల్లె, దొర్నిపాడు, బిలేకల్లు, మద్దికెర గ్రామాల్లో నాబార్డు కూరగాయల మార్కెట్‌ను నిర్మించామ న్నారు. ఏజీఎం సుబ్బారెడ్డి, బ్యాంకు మేనేజర్ వెంకటేశ్ గౌడు, ఎంపీడీవో కొండయ్య, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, ముస్టూరు రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

- మద్దికెరలోని ఫిల్టర్ బెడ్, పశువుల సంత మార్కెట్, మద్దమ్మకుంట అభివృద్ధి పనులకు నాబార్డు నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు నాబార్డు డీజీఎంను కోరారు. అనంతరం సభ్యులు వి. నాగేశ్వరరెడ్డి, ఆంజనేయులు సన్మానించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



కనకదుర్గమ్మ సన్నిధిలో వేద ఆశీర్వచనం పొందుతున్న ఎమ్మెల్యే దంపతులు

ఆత్మకూరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇంద్రకీలాద్రి కొండపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆతర్వాత అర్చకులు వారికి అమ్మవారి ప్రసాదం, జ్ఞాపికతో పాటు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మంగళగిరిలోని పానకాల నరసింహస్వామిని కూడా దర్శించుకున్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల రూరల్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తల్లి బిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీసం వేతనం అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యేసురత్నం, ఎ. నాగరాజు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చి 7 సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రఫీ, ఉపాధ్యక్షుడు కిషన్ కుమార్, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహానందిలో బహిరంగ వేలం వాయిదా

మహానంది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన వివిధ బహిరంగ వేలాల్లో దేవస్థానానికి అనుకున్నంత ఆదాయం రాక పోవడంతో వాయిదా వేసినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలంలో దేవస్థానానికి చెందిన పాత బొలేరా వాహనానికి బహిరం వేలంలో పాల్గొన్న పాటదారులు స్పందించకపోవడంతో వాయిదా వేసినట్లు ఈవో చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో యర్రమల్ల మధు, గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌శెట్టి, సీనియర్ అసిస్టెంట్లు పసుపుల సబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకి సేవ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు పూజలు జరిపిన అనంతరం కల్యాణ మంటపంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకిపై స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులు గావించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో 30 యాక్ట్ అమలు

నంద్యాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నట్లు ఏఎస్పీ మంద జావళి పేర్కొన్నారు. శుక్రవారం ఏఎస్పీ మాట్లాడుతూ నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న మహానంది, బండిఆత్మకూరు, గోస్పాడు, పాణ్యం, గడివేముల పోలీసుస్టేషన్ల పరిధిలో 30పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఉత్సవాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించుకోదలిచిన వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మంద జావళి హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు: కలెక్టర్



నంద్యాల నూనెపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. ఈనెల 25, 26వ తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించే కలెక్టర్ల సదస్సులో వివరించాల్సిన అంశాలపై శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసీ కెనాల్, కుందూ నది, ఎస్‌ఆర్‌బీసీ కాల్వలపై ఆధారపడి ఉన్న 13సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులలో నీటిని పూర్తిగా నింపాలన్నారు. జిల్లాలోని ఆర్వో ప్లాంట్ల నిర్వహణ సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీలు నిర్వహించి నివేదికలు అందించాలన్నారు. వేసవిలో వడదెబ్బ, అతిసార వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలని, చికిత్సలకు అవసరమయ్యే మందులను, కిట్లను సిద్ధం చేసుకోవాలన్నారు.

● కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమ గోడ పత్రికలను కలెక్టర్ రాజకుమారి ఆవిష్కరించారు. డీఆర్వో రాము నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రూల్లా పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

నందికొట్కూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బేడ, బుడగ జంగం కులానికి ఉన్న సమస్యను తొలగిస్తూ అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగం పరంగా తమ కులానికి పూర్తి హక్కును కలిగిస్తూ వర్గీకరణ అంశంలో 'ఏ' గ్రూపులో చేరుస్తూ 1శాతం కేటాయించి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు సీఎంకు రుణ పడి ఉంటామన్నారు.

ఆధార్ కేంద్రాలు తనిఖీ

పాములపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ఎంపీడీవో చంద్రశేఖర్ తనిఖీ నిర్వహించారు. శుక్రవారం ఎర్రగూడూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూఎస్, వర్క్‌ఫ్రంహోం, తదితర సర్వేలను త్వరిగగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.



ప్రజారోగ్యం.. మురికి మయం



- ప్రజల ప్రాణాలు దైవాధీనం
- డ్రైనేజీల్లో తాగు నీటి వ్యవస్థ
- లీకేజీ అవుతున్నా పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో పట్టణ ప్రజలు

ఆత్మకూరు ఘటన నుంచి పాఠాలు నేర్వలేదేమో

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటీలో ప్రజారోగ్యం మురికి కాలువల్లో ప్రవహిస్తోంది. మంచి నీటి పైపుల్లోకి మురుగు నీరు ప్రవహిస్తుంచడం భయాందోళన కలిగిస్తోంది. పట్టణంలోని దేవనగరం, వెంకటాచల కాలనీ, బొగ్గులైను, ఫరూక్‌నగర్, బైటిపేట, దళితవాడ, తదితర ప్రాంతాల్లో తాగు నీటి పైపు లైన్లు మురికి కాలువల గుండా వెళుతూ పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదపుటంచుల్లోకి నెట్టివేస్తున్నాయి.



36వ వార్డు సచివాలయ పరిసరాల్లో..

ఇటీవల ఆత్మకూరు పట్టణంలోని నీలి తొట్ల వీధిలో తాగు నీటి పైపు లైన్ల నుంచి మురికి సరఫరా అయిన విషయం తెలిసిందే. సదరు మురికి నీరు తాగి కొందరు అమాయకులు మరణించిన ఘటన విదితమే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తింగా సంచలనం సృష్టించింది. కలెక్టర్ రాజకుమారి గనియా, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ స్వయంగా రంగంలోకి దిగితే కానీ పరిస్థితులు మెరగవ్వలేదు. నంద్యాల పట్టణంలో కూడా మురికి కాల్వల్లోనే తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. అవి ఏళ్ల కొద్ది మరమ్మతులకు నోచుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల లీకేజీలవుతున్నా అలాగే నీటి సరఫరా చేస్తున్నారు.

దళితవాడల్లో దారుణం



దళితవాడలు మూమూలుగానే నిర్లక్ష్యానికి గురవుతాయి. తాగు నీటి వ్యవస్థ పరిస్థితి కూడా అంతే! అక్కడక్కడ మురికి కాలువల్లో ఉన్న మంచినీటి పైప్ లైన్లపై అధికారులు నిఘా వేయాలి.

- మద్దిలేటి బైటిపేట

కాలువల నిర్వహణే లోపభూయిష్టం



మున్సిపల్ కార్యాలయ సమీపంలో

మురికి కాలవల గుండా మంచి నీటి పైప్ లైను వెళ్లినా కాలువల నిర్వాహణ బాగుంటే పైప్‌లైన్లతో సమస్య ఉండదు. కానీ కాలువల్లో మురికి నీటిని తరలించే వ్యవస్థ నంద్యాలలో లోపభూయిష్టం. దీంతో మురికి నీరు కాలువల్లో ఎక్కడిక్కడ నిలువ ఉంటూ ఒళ్లు గగుర్పొడుస్తోంది. మురికి కాలువల గుండా వెళుతున్న పైప్ లైను చిలుము పట్టడంతో పాటు ఆ పైపుల నుంచి డ్రైనేజీ నీరు ఇళ్లకు సరఫరా అయితే ఎలా అన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పైగా పైప్ లైన్లను నిర్దిష్ట సమయంలో మార్చే అలవాటు మున్సిపాలిటీకి లేదు. దీంతో కాలం చెల్లిన పైప్ లైన్లు మురికి నీళ్లలో ఉండటం వల్ల త్వరగా చిలుము పట్టి ప్రజారోగ్యాన్ని మరింత ప్రశ్నార్థకం చేస్తాయి. పోతే ప్రజల ప్రాణాలే అంటారు మున్సిపల్ అధికారులు?



సత్యసాయి కల్యాణ మంటపం సమీపంలో..



దేవనగర్‌లో మురుగునీటితో ఇలా..

పనులు చేస్తున్నాం

పట్టణంలో మొదటగా డ్రైన్లలో ఉంటే కొళాయిలను సురక్షిత స్థానానికి మారుస్తున్నాం ప్రస్తుతం ఆ పనులు ముగింపు దశలో ఉన్నాయి. అనంతరం డ్రైన్ల గుండా వెళుతున్న తాగు నీటి పైప్ లైన్లను ప్రాధాన్యత క్రమంలో మారుస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- నాగభూషణ్ రెడ్డి, డీఈ వాటర్ వర్క్స్

పైపులైన్లతో భయమేస్తోన్నాయ్..



పట్టణంలో తాగునీటి పైప్ లైన్ వ్యవస్థ ఆందోళన కరంగా ఉంది. మురికి కాలువల్లో వెళ్లుతున్న మంచినీటి పైప్ లైన్లను చూస్తుంటే ఆత్మకూరు నీలితొట్ల వీధి ఘటన గుర్తొస్తోంది. మురికి కాల్వలో ఉన్న వాటిని మార్చాలి.

- ప్రసాద్, సీపీఐ పట్టణ ప్రధాన కార్యదర్శి

అప్రమత్తత అవసరం



ప్రధానంగా ఇరుకు సందులతో పాటు మురికివాడల్లో ఉన్న తాగు నీటిపైపు లైన్లపై అధికారులు నిరంతర నిఘా ఉంచాలి. ప్రమాదాలు జరగక ముందే అధికారులు మేల్కోవాలి. కొన్ని చోట్ల పైపులైన్లు లీకేజీలవుతున్నాయి.

- పఠాన్ జాకీర్ అలీఖాన్, మెకానిక్

వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- వేదపండితుల సమక్షంలో అంకురార్పణ



వార్షికోత్సవాలకు అంకురార్పణ పలుకుతున్న అర్చకులు

ఆత్మకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో వెలసిన వేంకటేశ్వరుడి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం వైభవంగా ప్రారంభయ్యాయి. దేవస్థానం ప్రధాన అర్చకులు దేవరపల్లి అనిల్‌కుమార్ సమక్షంలో శాస్త్రోక్తంగా ఆంకురార్పణ చేశారు. తొలిరోజు స్వామివారికి సుప్రభాత సేవా, ప్రాతఃమారాధన సేవాకాల నివేదన చేపట్టారు. సాయంత్రం ఆరాధన, పారాయణ, గోపూజ, విశ్వక్షేనారాధన, పుణ్యాహం, రక్షాబంధన క్రతువులను నిర్వహించి అంకురార్పణకు నాందిపలికారు. 22న సంతానార్థుల కోసం గరుడప్రసాద కార్యక్రమం, 23వ తేదిన లక్ష్మీఅమ్మవారికి అభిషేకం, అలంకరణతో పాటు లక్ష్మీదేవీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, వాహనోత్సవాలను జరపనున్నారు. అదేవిధంగా 24న గోదాదేవీ అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గోదాదేవీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేయనున్నారు. 25న సాయంత్రం ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన, వాహనోత్సవాలను నిర్వహించనున్నారు. కాగా చివరిరోజైన 26న వార్షికోత్సవ మహాపూర్ణాహుతితో వేడుకలు ముగిస్తాయి. అలాగే అదేరోజు సాయంత్రం 6.30గంటలకు స్వామిఅమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు దేవరపల్లి అనిల్‌కుమార్ వెల్లడించారు.

ముస్లింలకు ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిలు అన్నారు. శుక్రవారం సాయంత్రం నందికొట్కూరు శివారులోని రబ్బాని గోదాము వద్ద మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్‌లు ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే గిత్తాజయసూర్య, మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో రబ్బాని గోడౌన్స్ అధినేత అల్-హజ్-హాజీ మహబూబ్ సాహెబ్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు, ముస్లీం మత పెద్దలు, పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని మసీదులో శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. ముస్లింలు రంజాన్ మాసం ఎంతో ప్రత్యేకమైందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేశం నరేంద్రారెడ్డి, రమణారెడ్డి, ఫరూక్ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

నందికొట్కూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హాజీ నగర్, మారుతి నగర్, విలేకరి కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సీపీఎం నాయకులు ప్రజచైతన్య యాత్రను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు, చౌకదుకాణాలు, ఎలిమెంటరీ స్కూలును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్‌బాషా, సాహిదాబి, శివ, నాయక్, కాలనీ వాసులు అయ్యన్న, చంద్ర, వడ్డ చంద్రయ్య, రామకృష్ణ, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శివ భక్తులకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

నందికొట్కూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం వెళ్లే శివ భక్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆత్మకూరు రోడ్డు జమ్మిచెట్టు దగ్గర మన ఊరు మన గుడి మన బాధ్యత వారి ఆధ్వర్యంలో శ్రీశైలం క్షేత్రానికి ఉగాది సందర్భంగా వెళ్లే కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కాలినడకన వచ్చే భక్తులకు ఆయుర్వేద, అల్లోపతి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డి, రఘువీరు, శ్రీధర్, గాంధీ, బాబు రావు, శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్ సతీమణి మృతికి సంతాపం

మహానంది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్ మృతికి మహానంది మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు సంతాపం శుక్రవారం తెలిపారు. సీనియర్ టీడీపీ నాయకుడు, శ్రీశైలం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యుడు కలర్స్ రవినాథరావుతో పాటు మహానంది మండలం బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాశం శ్రీనివాసులు యాదవ్, నంద్యాల పార్లమెంట్ టీడీపీ యువత కార్యదర్శి చింతం క్రాంతికుమార్ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

నంద్యాల కల్చరల్: మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్ మృతికి నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నానని అన్నారు. హైదరాబాద్‌లో జరిగే అంత్యక్రియలకు మధు వెళ్లారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

పాములపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక మోడల్‌స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల వద్ద ఫ్రెండ్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు కురువ చిన్న పుల్లయ్య, రామ్మోహన్‌యాదవ్, చంద్రుడు, రామచంద్రరాయుడు నిమ్మరసం, మజ్జిగ అందజేశారు.

రేషన్ బియ్యం వాహనం పట్టివేత

నందికొట్కూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు శివారు ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న టాటాఏసీ ఆటోను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రాబడిన సమాచారం మేరకు జీవన్ జ్యోతి స్కూల్ సమీపంలో టాటా ఏసీ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులకు పట్టుబడిన ఈ వాహనంలో పట్టణానికి చెందిన వారే అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

27న ప్రాంతీయ వ్యవసాయ ఫెయిర్ - 2025

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి 29 వరకు ప్రాంతీయ వ్యవసాయ ఫెయిర్ 6 - 2025 మెగా ఈవెంట్ గుంటూరులో నిర్వహిస్తున్నట్లు ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ జాన్సన్ తెలిపారు.వారు మాట్లాడుతూ దక్షిణ ప్రాంత వ్యవసాయ ఫెయిర్‌ను గుంటూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనకు వివిధ రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పుదుచ్చేరి నుంచి సుమారు 15 వేల మంది రైతులు, విద్యార్థులు, అధికారులు పాల్గొంటారని వివరించారు. రైతులకు ఉపయోగపడేలా సుమారు 200 స్టాళ్ల ద్వారా వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా రైతులు ఈ రైతు సదస్సులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక మహోత్సవం



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న వైస్ ఛాన్సలర్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయస్థాయి సాంకేతిక, సాంస్కృతిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ ఎస్ వెంకట్రామిరెడ్డి, ఎండి దినేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బి.సూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లి వారి ఆధ్వర్యంలో పంపిణీ చేసిన వ్యవసాయ పనిముట్లను హరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సైంటిస్టు డా.ధనలక్ష్మి సూచించారు. శుక్రవారం కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామ దళితవాడ రైతులకు నార్మ్ హరిజన ఉప ప్రణాళికలో భాగంగా వ్యవసాయ పరిశోధన యాజమాన్య సంస్థ హైదరాబాదు వారిచే 9 రకాల వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. కొక్కెరంచలో 200 మందికి పైగా దళిత రైతులకు రోటవేటర్, తార్పాలిన్లు, 9 చెక్కల గొర్రు, చలికెలు, కొడవళ్లు, నాగళ్లు తదితర 9రకాల వ్యవసాయ పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సురేష్ కుమార్, శాస్త్రవేత్తలు రమణయ్య, క్రిష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడు, స్థానిక సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, కమిటి సభ్యులు జయరాం, వెంకటరమణ, నాగరాజు, నాగరత్నం, చిన్నస్వాములు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

సున్నిపెంట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న సందర్భంలో సన్నిపెంట ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు రాజ్యాగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి అర్పించారు. సున్నిపెంటలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగెల్ల సురేష్, ప్రసాద్, విజయ్, ఎంఈఎఫ్ నాయకులు లక్ష్మయ్య, కూటమి నాయకులు జంకే సుబ్బారెడ్డి, మల్లేష్, బీజేపీ నాయకులు మల్లికార్జున, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బురద తొలగింపు



బురదను తొలగిస్తున్న మహిళలు

కొత్తపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సప్తనదుల జలాల నుంచి బయల్పడిన సంగమేశ్వరాలయంలో బురద తొలగింపు ప్రక్రియ ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో ముమ్మరంగా సాగుతున్నాయి. బురద నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మోటార్లను ఏర్పాటు చేసి నీరు తొలగింపును యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన భక్తులు స్వచ్ఛందంగా తరలివచ్చి సంగమేశ్వరంలో బురద తొలగించే పనుల్లో పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

'తల్లికి వందనం పథకం అమలు చేయాలి'

బేతంచెర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఏపీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బేతంచెర్ల పట్టణంలో ఏపీ స్టూడెంట్ ఫెడరేషన్ కార్యాలయంలో బేతంచెర్ల మండల అధ్యక్షుడు సద్దాం బాషా అధ్యక్షత విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్, శేఖర్, శివ, నరసింహులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చాగలమర్రి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రామసుబ్బయ్య, గురునాథ్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల, సెయింట్‌ఆన్స్ పాఠశాలలో జరుగుతున్న పది పరీక్షా కేంద్రాలను వారు తనిఖీ చేశారు. ప్రశ్నా పత్రాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా, మూడు పరీక్షా కేంద్రాల్లో 751 మందికి గాను 738 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారి వెంట ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి, సీఎస్, డీవోలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవతరగతి పరీక్షా కేంద్రాన్ని ప్రత్యేక స్క్వాడ్ అధికారి మనోహర్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మనోహర్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో కొలిమిగుండ్ల ఎంఈవో అబ్దుల్‌కలాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ



అమ్మవారి పల్లకి

బనగానపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీ మాత పల్లకీసేవ నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కన్యాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం : రుద్రవరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు భారీసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పిల్లలు ఆకట్టుకునేలా బోధించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

కొలిమిగుండ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే చిన్న పిల్లలను ఆకట్టుకునేలా విద్యా బోధన సాగాలని మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోషణ్ భీ .. పఢాయి భీ .. శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆధార్ శీల నవచేతన అవగాహన కార్యక్రమం నిర్వ హిం చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజరు పద్మావతి, కార్యక ర్త లు భాగ్యలక్ష్మీ, వసుంధర, అనిత, లీలావతి, శ్రీదేవి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు 380 దరఖాస్తులు

ఉయ్యాలవాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల నుంచి గృహ నిర్మాణాలకు 380 దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ ఏఈ నరసింహరావు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో ఉమమహేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. ఈ నెల చివరిలోపు నూతన గృహాల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. అలాగే మండలంలో వివిధ దశల్లో నిలిచిపోయిన 226 గృహాలను గుర్తిమచా మన్నారు. వెంటనే వారు పనులు ప్రారంభించాలన్నారు.

ఎర్రవాగు క్లీనింగ్ పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అపరిశుభ్రతకు నిలయంగా మారిన ఎర్రవాగు క్లీనింగ్ పనులు శుక్రవారం ప్రారంభించినట్లు స ర్పంచ్ జినుగు శివరాముడు వెల్లడించారు. చెత్తా, మురుగు నీటితో ఎర్ర వాగు దోమలకు నిలయంగా మారిందని సర్పంచ్ శివ అన్నారు. దీంతో ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువను శుభ్రపరిచినట్లు సర్పంచ్ వివరించారు.

మున్సిపల్ వేలం మళ్లీ వాయిదా

డోన్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుక్రవారం జరగాల్సిన వేలాలు మళ్లీ వాయిదా పడినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడు తెలిపారు. మున్సిపల్ టెండరుదారులు డీడీలు తీసుకురాకపోవడంతో మళ్లీ వాయిదా వేసినట్లు వారు తెలిపారు. మళ్లీ వేలం తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఆరీఫ్, ఆర్వో వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **నీటి సరఫరాకు అంతరాయం:**

పట్టణంలో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఉందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు శుక్రవారం తెలిపారు. వైఎస్‌నగర్‌లోని రైల్వే ట్రాక్ వద్ద లీకేజీ మరమ్మతులు పూర్తయిన వెంటనే సోమవారం ఉదయం నుంచి నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



భోజనాన్ని వడ్డిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో ట్రాలీ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూ నియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్‌లో టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ వడ్డించారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషాన్ని ఇచ్చిందని బీసీ ఇందిరమ్మ అన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రుద్రవరం : రుద్రవరం జామియా మసీదులో శుక్రవారం హైదరాబాదుకు చెందిన ఇస్మాయిల్ ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక దువా (ప్రార్థన) చేశారు. ఈ విందులో ముస్లిం మతపెద్దలు, రుద్రవరం, కొండమాయపల్లె, కొత్తప ల్లె, తువ్వపల్లె, నాగులవరం గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

అడవికి నిప్పు
మానవాళికి ముప్పు

● వేసవిలో నల్లమలలో అగ్నిప్రమాదాలు
● వన్యప్రాణులకు పొంచి ఉన్న ప్రమాదం



నల్లమలలో కాలుతున్న చెట్లు

రుద్రవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వైపు రికార్డు స్థాయిలో ఎండలు మండుతున్నాయి. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ నిప్పులు కురిపిస్తున్నాడు. ఇలాంటి సమయంలో అగ్గి రాజుకుంటే బుగ్గే. వేసవి కాలంలో సహజంగా అడవుల్లో తరుచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. నల్లమల నంద్యాల డివిజను పరిధిలో రుద్రవరం రేంజ్ 42113.98 హెక్టార్లు, చెలిమ 23,740.53 హెక్టార్లు, నంద్యాల 19159.98, బండి ఆత్మకూరు 12865.90 హెక్టార్లు, గుండ్ల బ్రహ్మేశ్వరం 6651.93 హెక్టార్లులో విస్తరించి ఉంది. అడ వులతోనే మానవుని మనుగడ ఆధారపడి ఉంది. అడవులు విశాలంగా ఉండడంతో వర్షాలు కురుస్తాయి. ప్రజలు క్షామం నుంచి బయ టపడతారు. పంటలు సకాలంలో పండుతాయి. వృక్షాలు వన్యప్రాణులు జీవవైవిధ్యంలో ప్ర ముఖ పాత్ర వహిస్తాయి. మానవునికి ఎంతో సహకారాన్ని ఇస్తాయి. ఒక్కో వృక్షం పది మందికి సరిపడా ఆక్సిజన్ అందిస్తుంది. చెట్లు వరదల తీవ్రతను, తుఫాను తీవ్రతను తగ్గిస్తాయి. భూమి కోతను నివారిస్తాయి. భూ గర్భజలాలను పెంపొందించి కరువులను నివారిస్తాయి. అడవికి నిప్పు పెట్టడంతో మానవాళికి ముప్పు వాటిల్లుతుంది. వన్యప్రాణి సంపద, వృక్షసంప ద అగ్నికి ఆహుతి అవుతుంది. వన్య ప్రాణులు అడవి నుంచి బయటికి వచ్చే ప్రాణ హాని కలిగించే ప్రమాదం ఉంది. అడవికి నిప్పు పెట్టడంతో భూతాపం పెరిగి ఉష్ణోగ్రత్తలో మా ర్పులు వచ్చి వాతావరణం కాలుష్యం పెంచి పర్యా వరణ సమతుల్యం లోపించి ఎన్నోరకాల వ్యాధులకు వన్యప్రాణులు గురవుతాయి. ప్రజలు పూర్తి అవగాహనతో ఉన్నప్పుడే ప్రమాదాలు నివారించొచ్చని అధికారులు అంటున్నారు.

అడవి సంరక్షణకు చర్యలు



వేసవిలో అడవి సంరక్షణ కు చర్యలు తీసుకున్నాం. స హ జం గా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఒక చోట నుంచి ఇంకో చోటకు మంటలు వ్యాపించకుండా ఫైర్‌లైన్ ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు మంటలను గుర్తించి ఆర్పి వేస్తున్నాం. అడవికి నిప్పుపెడితే 1967 సెక్షన్20 ప్రకారం రెండుసంవత్సరాలు జైలు శిక్ష, జరిమానా ఉంటుంది.

\- శ్రీపతినాయుడు, రేంజర్, రుద్రవరం

బనగానపల్లె అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

● మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమో ఇవ్వాలని మంత్రి బీసీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపకల్పన చేసి అగ్రమామిగా తీర్చిదిద్దుతాని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి శాఖపై క్షుణ్ణంగా మంత్రి రివ్యూ చేశారు. మంత్రి మాట్లాడుతూ వేసవి కాలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, వేణుగోపాల్, ఏఈ సాయికృష్ణను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి డీఎంఎఫ్ నిధుల కింద నిధులు విడుదల చేస్తామన్నారు. విద్యుత్‌పై జరిగిన చర్చలో ట్రాన్స్‌ఫార్మర్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని ఇంకా స్తంభాలు, ఇతరత్రా ఏవైనా మెటీరియల్‌పై సమగ్ర నివేదిక అందించాలని ఏఈ శ్రీనివాసులు, గర్జప్పలను కోరారు. మంత్రి బీసీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారులు, సమన్వయంతో పనిచేసి బనగానపల్లె మండలాన్ని అభివృద్ధి చేయాలన్నారు. మండలంలో రూ.25 కోట్లతో సీసీ రోడ్లు వేశామన్నారు. బనగానపల్లె పట్టణంలో రూ. నాలుగు కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు సాగుతున్నాయని రెండో దశలో మరో రూ.నాలుగు కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు చేపడతామన్నారు. రెవెన్యూ సమస్యలపై స్పందించని వీఆర్‌వోలపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో రమణను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి, డీఈ నాగశ్రీనివాసులు, డీఈ కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

షాదీఖానా పనులు పూర్తి చేయాలి

బనగానపల్లె పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని మైనార్టీల కోసం నిర్మిస్తున్న షాదీఖానా భవనం పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని షాదీఖానా పనులు మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో షాదీఖానాకు నిధులు మంజూరైనా పట్టించుకోలే దన్నారు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యుద్ధ ప్రాతిపదికపై షాదీఖానా పనులు చేపట్టినట్లు తెలిపారు. షాదీఖానాను త్వరగా పూర్తి చేసి మైనార్టీలకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అరటి ఉత్పత్తిలో ఏపీదే అగ్రస్థానం



మాట్లాడుతున్న ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగరాజు

డోన్ రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అరటి ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం అని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని షాదీఖానాలో డోన్ ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో అరటి పంట సాగుపై జిల్లా స్థాయి రైతు సదస్సును నిర్వహించారు. పులివెందుల పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త శివరామకృష్ణ, రేష్మా పాల్గొన్నారు. సదస్సులో వారు మాట్లాడుతూ అరటి సాగు విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. జిల్లాలో అన్ని రకాల అరటి మేళాలు అనుకూలంగా ఉంటాయన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, రేష్మాలు రైతులకు అరటిసాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అరటిలో తల్లిమొక్కకు గెల మొదలుకాగానే రెండవ పిలకను పెరగనీయాలన్నారు. సూక్ష్మపోషకాలు తలెత్తకుండా మూడు నెలల వయసు నుంచి పిచికారి చేస్తుండాలన్నారు. అరటిగెల యాజమాన్యాన్ని తప్పక పాటించాలన్నారు. ఎరువులను అధికారులు సిఫారుసు చేసిన మోతాదులోనే వాడాలన్నారు. సమావేశంలో ఆత్మకూరు, అవుకు ఉద్యాన శాఖ అధికారులు చందన, రఘువరన్, వీహెచ్‌ఏ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



హోంగార్డు అనితకు క్యాష్ రివార్డు అందిస్తున్న కమాండెంట్ మహేష్ కుమార్

డోన్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాల అణచివేతలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సౌత్ రేంజ్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్, సౌత్‌రేంజ్ డీఎస్పీ కేవీవీఎస్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఫైర్‌స్టేషన్‌లో అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అర్బన్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు పీఎల్‌సీ జి.రామయ్య, ఆర్.శివయ్య, వి.అనిత, ఏ.గోపి కృష్ణ, జి. రామ్మూర్తికి క్యాష్ రివార్డులను అందజేశారు. సమావేశంలో ఆర్ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి తిరుపంరెడ్డి, సీసీ కే. వెంకటేశ్వర్లు, పీఎల్‌సీలు మధర్, రామయ్య, ఎస్‌సీ సంజీవుడు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'

బనగానపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాయకుడు నాయకుడు దస్తగిరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వర్గీకరణ వద్దని, ఐక్యతే ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, మారం నాగరాజు, రామసుబ్బయ్య, సత్యం, శివుడు, ప్రసాదు, ఓబన్న పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలని రాయలసీమ మాల మహానాడు అధ్యక్షుడు కోగిల ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉయ్యాలవాడ తహసీల్దారు శ్రీనివాసులును కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఓబులేసు, రవి, పుల్లన్న, సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

'ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి'

ప్యాపిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జలదుర్గం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల దృష్ట్యా ఆశావర్కర్ల వేతనాలను రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారి నుస్రత్‌బేగంకు ఆశావర్కర్లు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు క్రిష్ణవేణి, పుల్లమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి

బనగానపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి అప్పారి వెంకటస్వామి అందించిన సేవలు మరువలేనివి బనగానపల్లె యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం బనగానపల్లె యూటీఎఫ్ కార్యాలయంలో సత్యప్రకాశ్, జిల్లా ఆడిట్ కన్వీనర్ దస్తగిరి ఆధ్వర్యంలో అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, విజయకుమార్, పూజారి శ్రీనివాసులు, మనోహర్, రాఘవేంద్ర, మద్దిలేటినాయక్, వీరకుమార్‌రెడ్డి, లక్ష్మినాయక్, మల్లికార్జున, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు నీరు అందించాలి: సీపీఐ

బనగానపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దద్దనాల ప్రాజెక్టు కింద ఉన్న పంట పొలాలకు నీరు అందించాలని సీపీఐ నాయకులు కోరారు. శుక్రవారం రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో వినతిప్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లాసెక్రటరీ బాలకృష్ణ, సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు, ఎస్‌భాష తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సెక్రటరీలకు పనిభారం తగ్గించాలని వినతి:

గ్రామాల్లో సచివాలయాల్లో పనిచేసే గ్రామ సెక్రటరీలకు పనిభారం తగ్గించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు బనగానపల్లె వినతిపత్రం సమర్పించారు. సెక్రటరీలు గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు విశేష పూజలు

చాగలమర్రి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం కొత్తగా ఎంపికైన ఆలయ కార్యవర్గం సభ్యులు వాసవీమాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి వరప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎండవేడిమి అధికంగా ఉండటంతో పశువులకు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నవంగలి, చాగలమర్రి గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి దీపకుమారి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

చాగలమర్రి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి రైతు ఆపార్‌లో పేరు నమోదు చేసుకోవాలని ఏవో రంగనేతాజీ శుక్రవారం తెలిపారు. రైతు గుర్తింపు కార్డు ద్వారా సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

\- బాలకృష్ణుడు, ఈవోఆర్డీ, ప్యాపిలి



ప్యాపిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయ తీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఈవోఆర్డీ బాలకృష్ణుడు అన్నారు. ఇందుకోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని గ్రాపంచాయతీలు ఉన్నాయి?

జవాబు: మండలంలో 31 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీలను కూడా తరచూ సందర్శిస్తుంటాను. ఏ సమస్య వచ్చిన వెంటనే గ్రామానికి వెళ్లి పరిష్కరిస్తాం.

ప్రశ్న: పంచాయతీల అభివృద్ధికి ఎటువంటి కార్యక్రమాలు చేస్తుంటారు?

జవాబు: ఇంటి పన్నులే పంచాయతీలకు ఆదాయ వనరులు. పన్ను వసూళ్ల చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తాం. అలాగే పంచాయితీ పరిధిలో ఏవైన మైనింగ్ ఉన్నా వాటి ద్వారాకు పన్నులు వసూళ్ల చేసి పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేస్తాం.

ప్రశ్న: సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తున్నారా?

జవాబు: దాదాపు అన్ని పంచాయతీలలో చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం కేంద్రాలలో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయడానికి తగు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని కేంద్రాలను సక్రమంగా నిర్వహించడానికి జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: పంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి ?

జవాబు: నిర్లక్ష్యం వహిస్తే నిధుల్లో అక్రమాలు జరిగే అవకాశాలు ఉంటాయి. అయితే అటువంటి అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిధుల వినియోగంపై తప్పనిసరిగా రికార్డులు నిర్వహిస్తున్నాం. ఏటా పంచాయతీ ఆడిట్‌ను కూడా నిర్వహించడం వలన అక్రమాలు జరగడానికి అవకాశాలు తక్కువగా వుంటాయి.

ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి గ్రామాలు తిరుగుతున్నాం. పాడైపోయిన బోర్లకు మరమ్మతులు చేస్తున్నాం. అవసరమైన గ్రామంలో ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి సహకారంతో కొత్త బోర్లు వేస్తున్నాం. సమస్య తీవ్రంగా ఉంటే ఎమ్మెల్యే సూచన మేరకు ట్యాంకర్లు ద్వారా నీరు అందిస్తున్నాం.

శెట్టివీడులో డస్ట్‌బిన్ల పంపిణీ



డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న కార్యదర్శి ఆదినారాయణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామంలో చెత్తాచెదారం వేసుకునేదుందుకు ఇంటింటికి రెండు డస్ట్‌బిన్‌లను కార్యదర్శి ఆదినారాయణ పంపిణీ చేశారు. వైసీపీ పాపం.. ప్రజలకు శాపం అన్న శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి సచివాలయంలో మూలన పడేసిన డస్ట్‌బిన్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. చెత్త సంపద సృష్టి కోసం వాటిని ఇంటింటికి పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు తొలగింపునకు చర్యలు

చాగలమర్రి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని న్యూబిల్డింగ్స్ వీధిలో పంప్‌హౌస్ పథకం వద్ద నిలిచిన మురుగు నీటిని పంచాయతీ సిబ్బంది తొలగించారు. శుక్రవారం మురుగులో పంప్‌హౌస్ అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఈవో తాహిర్‌హుసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది ముళ్ల కంపలు, మురుగు నీటిని తొలగింప చేసి శుభ్రత పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బేతంచెర్ల పట్టణ శివారులోని కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ అబీదా బేగం సూచించారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేజీబీవీ పాఠాలలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ గ్రూపులో 40సీట్లు ఉన్నాయన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

చాగలమర్రి: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌వో సునీత శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తామన్నారు.

మంత్రి సతీమణి మృతి బాధాకరం

బనగానపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ శాఖా మంత్రి ఫరూక్ సతీమణి షహనాజ్ మృతి బాధాకరమని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. మంత్రి ఫరూక్‌ను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

● **ఆళ్లగడ్డ(శిరివెళ్ల):** రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి మృతికి టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని మంత్రి ఫరూక్ నివాసానికి చేరుకుని ఆ యన సతీమణి మృతదేహానికి జగత్ విఖ్యాత్‌రెడ్డి నివాళి అర్పించారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

డోన్ రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్ర భుత్వ లక్ష్యమని ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడలోని హెడ్ ఆఫీసులో ని ర్వహించిన బోర్డు మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ఏపీ సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, మేనేజర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి



మొక్క నాటుతున్న రేంజర్ శ్రీపతినాయుడు

రుద్రవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రుద్రవరం రేంజ్‌లోని పాల్కాన్ బేస్ క్యాంపులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెక్షన్‌ఆఫీసర్లు శ్రీనివాస్‌రెడ్డి, రామక్రిష్ణ, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.